సాక్షి
పెద్దపల్లి

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



పరిహారం రాకపాయె..

మండలంలోని బుధవారంపేట, రాజాపూర్ అన్నదాతలకు పరిహారం అందక అయోమయానికి గురవుతున్నారు.

8లో▸



అర్హులకు ఓటు కల్పించాలి

అర్హులకు ఓటు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సెప్టెంబర్ 17వేడుకల ముఖ్యఅతిథిగా భానుప్రసాదరావు

పెద్దపల్లిరూరల్: ఈనెల 17న నిర్వహించే జాతీయ సమైక్యత దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనమండలి చీఫ్ విప్ తానిపర్తి భానుప్రసాదరావు హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు



రాగినేడు ఆలయంలో పూజలు

పెద్దపల్లిరూరల్: శ్రావణంలో చివరి సోమవారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శైవక్షేత్రాల ముందు భక్తులు బారులు దీరారు. పట్టణంలోని శివాలయం, స్టేషన్‌రోడ్డులోని ఆంజనేయ, శివాలయం, రాగినేడులోని ఆలయంలో పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, అన్నపూజ నిర్వహించారు.

అటవీ అమరులకు నివాళి



బైక్‌ర్యాలీలో ఫారెస్టు అధికారులు

పెద్దపల్లిరూరల్: అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు పనిచేస్తూ.. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారి సేవలను స్మరిస్తూ అటవీ అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. ఏటా సెప్టెంబర్ 11న అమరులను స్మరిస్తూ అటవీఅమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని జిల్లా అటవీ అధికారి శివయ్య అన్నారు. రేంజ్ కార్యాలయంలో అధికారి నాగయ్య, శ్రీనివాసరావు, వెంకన్న, మంగిలాల్ తదితరులు అమరుకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాడి శ్రీనివాస్‌కు జాతీయ సాహిత్యరత్న అవార్డు



అవార్డు పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

ధర్మారం: మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ జాతీయ సాహిత్యరత్న అవార్డుకు ఎంపికై నట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. శ్రీనివాస్ ఉపాధ్యాయుడిగా, గాయకుడిగా భారత్ జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. వివిధ రంగాల్లో కృషిచేసిన వారికి బహుజన సాహిత్య అకాడమీ ఏటా అవార్డులు అందిస్తోంది. ఈ ఏడాదికి సాహిత్య కళ, సామాజిక సేవారంగంలో కృషిచేస్తున్న శ్రీనివాస్‌ను ఎంపిక చేసింది. అక్టోబర్ 15న న్యూఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా బహుజన రైటర్స్ 4వ నేషనల్ కాన్ఫరెన్స్ వేదికపై అవార్డు అందుకోనున్నారు. అవార్డుకు ఎంపికకావటం ఆనందంగా ఉందని శ్రీనివాస్ తెలిపారు.

ఎస్టీపీపీలో సేఫ్టీ కమిటీ పర్యటన



పవర్ ప్లాంట్ వద్ద ఓసీపీ-1 సేఫ్టీకమిటీ ఉద్యోగులు

గోదావరిఖని: జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టును ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-1 ఉద్యోగులు సోమవారం సందర్శించారు. రక్షణ విధానాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు సేఫ్టీ అధికారి ఎ.కోటయ్య ఉన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

రామగుండం: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రామగుండం రైల్వేస్టేషన్ పరిధిలోని ముస్లిం శ్మశానవాటిక సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. రామగుండం నగరానికి చెందిన రేగొండ సత్యనారాయణ (63) గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రామగుండం రైల్వే జీఆర్పీ ఔట్‌పోస్ట్ ఇన్‌చార్జి సంపత్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రచారం ఫుల్.. ఆదాయం నిల్

- పట్టణాల్లో విచ్చలవిడిగా వెలుస్తున్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు
- అనధికారికంగా వెలుస్తున్నా తనిఖీలు శూన్యం
- బల్దియాలకు వస్తున్న ఆదాయం అంతంతే
- పర్మిషన్, ట్యాక్స్‌పై దృష్టిసారించని పాలకవర్గాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్నవి జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అనధికారికంగా వెలిసిన ఫ్లెక్సీలు, బోర్డులు. ఇలా ఒక్క పెద్దపల్లి మున్సిపాలిటీయే కాదు, రామగుండం కార్పొరేషన్, సుల్తానాబాద్, మంథని బల్దియాల్లోనూ ఇదే పరిస్థితి. ప్రకటనలపై పెద్దపల్లి మున్సిపాలిటీలో రూ.82వేలు, రామగుండం కార్పొరేషన్‌లో రూ.13 లక్షలు, సుల్తానాబాద్‌లో రూ.40వేలు, మంథనిలో రూ.3వేల ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. రాజకీయ పార్టీల ప్రచారం, పుట్టినరోజులు, దినోత్సవాలు, పండుగల సందర్భంగా పట్టణాల్లో ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ పెడుతూ ప్రచారం జోరుగా చేసుకుంటున్నా వాటి ద్వారా మాత్రం బల్దియాలకు ఆదాయం తక్కువగానే ఉంటోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి వాటిని గుర్తించి పన్ను విధిస్తే బల్దియాలకు అదనపు ఆదాయం సమకూరే అవకాశాలున్నాయి.



సాక్షి, పెద్దపల్లి: ఇంటి పన్ను, ఆస్తి పన్ను.. తదితర పన్నులను ముక్కుపిండి వసూలు చేస్తున్న బల్దియాలు ప్రకటనల పన్నుల వసూళ్లపై మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. జిల్లాలోని పట్టణాల్లో ఏ రోడ్డు మీద, ఏ కూడలిలో చూసినా కళ్లు జిగేల్‌మనేలా ప్రకటనలు దర్శనమిస్తున్నాయి. ప్రకటనలపై పన్ను విధించడంలో యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. పట్టణ ప్రణాళిక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన చర్యలు చేపట్టాల్సి ఉన్నా ఉదాసీనతతో బల్దియాలకు భారీగా ఆదాయం గండిపడుతోంది. కేవలం హోర్డింగులే కాకుండా ప్రతి చిన్న సందర్భంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న బ్యానర్లు, ఫ్లెక్సీల కారణంగా విపరీతమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటి ఏర్పాటుకు అసలు అనుమతులే తీసుకోవడం లేదు. సుల్తానాబాద్‌లో ఇలాంటి ఫ్లెక్సీలతో గతంలో ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయి. రామగుండం కార్పొరేషన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఓ హోర్డింగ్‌కు ఫ్లెక్సీ కడుతుండగా ఓ వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడి మృతిచెందిన సంఘటన ఇటీవల చోటు చేసుకుంది. వర్షాలు, ఈదురుగాలులు వీస్తున్నప్పుడు సదరు ఫ్లెక్సీలు గాలికి కొట్టుకుపోయి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

ఆదాయంపై పట్టింపేదీ..?

హోర్డింగులు ఏర్పాటు చేసుకునేందుకు మున్సిపాలిటీలకు నిర్ణీత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధంగా వసూలయ్యే పన్నులు మున్సిపాలిటీల ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి. అయితే ఈ పన్ను వసూళ్లు సక్రమంగా జరగకపోవడంతో రావాల్సినంత ఆదాయం లభించడం లేదు. ఎన్నింటికి అనుమతులు పొందారు..? ఏయే సెంటర్లలో ఎన్ని ఏర్పాటు చేశారు..? అనే అంశాలపై అధికారులకు స్పష్టత లేదు. ఇక ప్రధాన కూడళ్లు, ఖాళీ స్థలాల్లో ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటయ్యే వాటికి అసలు అనుమతులే తీసుకోవడం లేదు. వీటి ద్వారా మున్సిపాలిటీలకు రూ.లక్షల్లో ఆదాయం రావాల్సి ఉండగా.. కేవలం రూ.వేలల్లో మాత్రమే ఆదాయం చేకూరుతోంది. మంథని మున్సిపాలిటీలో ఇంతవరకు ఒక్కరు కూడా హోర్డింగ్స్‌కు అనుమతులు తీసుకోలేదంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

పండుగలకు ప్రచారం జోరుగా

పండుగల వేళ శుభాకాంక్షలు తెలిపేందుకు.. నేతల పుట్టిన రోజు, ముఖ్యనేతల రాక సందర్భంగా ఆయా పార్టీల స్థానిక నాయకులు, కార్యకర్తలు ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టేందుకు పోటీ పడుతున్నారు. మున్సిపాల్ చట్టం ప్రకారం వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో ఎలాంటి ప్రచార ఫ్లెక్సీలు పెట్టరాదనే నిబంధనలు ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాలు తిరిగే కూడళ్లల్లో ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మరోపక్క విద్యుత్ స్తంభాలకు, రోడ్లపై కర్రలు పాతి ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను అనధికారిక ప్రకటనలుగా కనిపిస్తున్నా చట్టప్రకారం చర్యలు తీసుకునే అధికారం ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు అటువంటి ప్రయత్నాలు చేస్తున్న దాఖలాలే కనిపించడం లేదు. జరిమానాలు విధించడం సంగతి అటుంచితే కనీసం వాటిని తొలగించే ప్రయత్నం చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతోనే మున్సిపల్ అధికారులు మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఆయా మున్సిపాలిటీల టౌన్ ప్లానింగ్ అధికారుల వివరణ కోరగా నిబంధనల ప్రకారమే హోర్డింగులు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమష్టి కృషితో అద్భుత ఫలితాలు

- జిల్లా అదనపు న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు



జడ్జి దుర్గం గణేశ్‌ను శాలువాతో సన్మానిస్తున్న జడ్జి శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: సమష్టి కృషి, సమన్వయంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని గోదావరిఖని జిల్లా అదనపు న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం గోదావరిఖనిలోని అదనపు కోర్టు ఆవరణలో జరిగిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. ఈనెల 9న నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్ సందర్భంగా కేసుల పరిష్కారంలో జిల్లా 14వ స్థానం, గోదావరిఖని కోర్టులు మొదటి స్థానంలో నిలిచాయని అన్నారు. సహకరించిన న్యాయమూర్తులు, సీఐలు, ఎస్సైలు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులను సత్కరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్, ఒకటో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ దుర్గం గణేష్, గోదావరిఖని, మంథని, రామగుండం సీఐలు ప్రసాద్ రావు, సతీశ్, చంద్రశేఖర్ గౌడ్, ఎస్సైలు, న్యాయవాదులు సిగిరి సంజయ్‌కుమార్, సీహెచ్.శైలజ, బార్ అసోసియేషన్ నాయకులు బోడ సమ్మయ్య, ఎ.ప్రవీణ్‌కుమార్, ముచ్చకుర్తి కుమార్, శంకర్, సతీశ్, వెంకటేశ్, శ్రీధర్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- అలసత్వం వహించే అధికారులపై చర్యలు
- ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: 'ప్రభుత్వం అమలు చేసే పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచేలా అనేక ప్రదర్శనలు ఇచ్చాను. నాకు ఆసరా పింఛన్ ఇప్పించి ఆదుకోండి..' ఇది కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన గడ్డం సారయ్య ఆవేదన. 'ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కరీంనగర్ కార్యాలయం అధికారులు చెల్లించడం లేదు..' ఇది మథర్ థెరిస్సా కాలేజీ ఇంజినీరింగ్, డిప్లమా గిరిజన విద్యార్థుల వినతి. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్ లాల్‌కు విన్నవించారు. అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. భూసంబంధమైన సమస్యలను తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేసినా.. సకాలంలో రాకున్నా చర్యలు తప్పవన్నారు.

కార్యదర్శిని బదిలీ చేయొద్దు



ఓదెల మండలం హరిపురం పంచాయతీ కార్యదర్శి ఆవుల శ్రీనివాస్‌ను బదిలీ చేయొద్దు. సర్పంచ్ మినహా పంచాయతీ పాలకమండలి, గ్రామస్తులంతా ఇక్కడే ఉండాలని కోరుతుంటే అధికారులు ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా వ్యవహరించడం సరికాదు. కార్యదర్శి బదిలీని రద్దుచేసి హరిపురంలోనే కొనసాగించాలి.

– గంట రాములు, ఓదెల జెడ్పీటీసీ, హరిపురం వాసులు

మాకు న్యాయం చేయండి



ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్టు కింద భూములు, ఇళ్లు కోల్పోయిన మాకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని పూర్తిస్థాయిలో ఇప్పించి ఆదుకోవాలి. 18ఏళ్లు నిండిన ఆడపిల్లలకు వర్తింపజేయాలి. ప్యాకేజీతోపాటు నివాసయోగ్యమైన ప్లాట్లు ఇవ్వాలి. కొంతమంది యువకులకు నామమాత్రంగానే చెల్లించారు. అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీపాదసాగర్ ముంపు బాధితులు, కుక్కలగూడూర్

ఇసుక క్వారీతో పంటనష్టం



ముత్తారం మండలం ఖమ్మంపల్లిలోని నా పట్టాభూమిలో పంట నష్టం చేసిన ఇసుక క్వారీ నిర్వాహకులపై చర్యలు తీసుకుని నాకు జరిగిన నష్టాన్ని ఇప్పించి ఆదుకోవాలి. కారకాసులకుంట అలుగుకట్ట నుంచి ఇసుక క్వారీ వారు రోడ్ల కోసం ఎర్రమట్టిని అక్రమంగా తీయడం వల్లే నా పంట భూమికి నష్టం కలిగింది. విచారణ జరిపి న్యాయం చేయాలి.

– పెట్టెం రవి, ఖమ్మంపల్లి

మచ్చుపేటలో మెడికల్ క్యాంపు



రోగులను పరిశీలించి మందులు ఇస్తున్న వైద్యులు



మురికి కాలువలో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

- 112 మందికి టెస్ట్‌లు
- తొమ్మిది మందికి జ్వరాలు
- మరి కొందరికి దగ్గు, జలుబు
- మురికి కాలువలు శుభ్రం
- గ్రామంలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- పంచాయతీ కార్యదర్శిపై డీఎల్‌పీవో ఆగ్రహం


సాక్షి స్పందన

ముత్తారం: మండలంలోని మచ్చుపేటలో వైద్యాధికారులు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇంటికొకరు చొప్పున విషజ్వరాలతో బాధపడుతుండడంతో 'మంచంపట్టిన మచ్చుపేట' శీర్షికన 'సాక్షి' సోమవారం కథనం ప్రచురించిన విషయం తెల్సిందే. స్పందించిన మండల వైద్యాధికారులు గ్రామానికి చేరుకుని పంచాయతీ సిబ్బందితో మురికికాలువలను శుభ్రం చేయించారు. మంథని డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వేణుమాధవ్ గ్రామాన్ని సందర్శించారు. అస్తవ్యస్తంగా ఉన్న మురికికాలువలు, తాగునీటి లీకేజీలను పరిశీలించారు. పారిశుధ్యం ఇలాగే ఉంటుందా..? అని డీఎల్‌పీవో పంచాయతీ కార్యదర్శి సతీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య లోపంతోనే జ్వరాలు వస్తున్నాయని స్థానికులు తెలిపారు. మురికి కాలువలను శుభ్రం చేయిస్తూ బ్లీచింగ్‌పౌడర్ చల్లించారు. పందిళ్ల రాధ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

112 మందికి పరీక్షలు

వైద్య శిబిరంలో 112 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో తొమ్మిదిమందికి జ్వరం ఉన్నట్లు, మిగితావారు దగ్గు, జలుబు, ఒళ్లనొప్పులతో బాధపడుతున్నట్లు గుర్తించామని మండల వైద్యాధికారి అమరేందర్‌రావు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి రక్తనమూనాలు సేకరించామని, డెంగీ, ప్లేట్‌లెట్స్ టెస్ట్‌లకు పంపించామని, రిపోర్ట్ రాగానే బాధితులను అప్రమత్తం చేస్తామని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఉన్న గ్రామంలోనే ఇంతమందికి జ్వరాలు రావడం ఏమిటని, వైద్యులు అందుబాటులో లేకపోవడమే కారణమని సర్పంచ్ మేడగోని సతీశ్ తెలిపారు. హెచ్‌ఈవో నరసింహారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీఎస్ లావణ్య, దీప్తి, శోభారాణి, హెల్త్ అసిస్టెంట్‌లు మిట్ట శ్రీని వాస్, పి.శ్రీనివాస్, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

వినాయకచవితికి మూడంచెల భద్రత



సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: వినాయక చవితికి మూడంచెల భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. సోమవారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల శాంతికమిటీ సమావేశంలో మాట్లాడారు. వినాయకచవితి మొదలు.. నిమజ్జనం వరకు మూడంచెల భద్రత కొనసాగుతుందన్నారు. కమిషనరేట్ భవనం ప్రారంభం తరువాత మొదటిసారి నిర్వహిస్తున్న పండుగ అని, అందరూ ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈనెల 15లోపు విగ్రహాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ, వాటిని ఆన్‌లైన్ చేయడం, విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేస్తామన్నారు. నిమజ్జనం సాఫీగా సాగేలా రూట్‌మ్యాప్, ఏర్పాట్లు పర్యవేక్షిస్తామన్నారు. కమిషనరేట్ పరిధిలోని రెండు జిల్లాల్లో 3వేలకుపైగా విగ్రహాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. వినాయక చవితి, మిలాద్‌ఉన్‌నబీ ఒకేరోజు వస్తున్నందున అందరూ శాంతి సామరస్యంతో పండుగ జరుపుకోవాలన్నారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే బైండోవర్

సోషల్‌మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టి శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తే బైండోవర్ చేయాలని సీపీ సూచించారు. అసత్య ప్రచారాలు, పుకార్లు, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా అభ్యంతరకర పోస్టులు పెట్టే వారిపై దృష్టి సారించాలన్నారు. మండపాల వద్ద నిర్వహణ కమిటీలు సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ ఉల్‌హక్, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు పాల్గొన్నారు.

విజ్ఞానంతోనే అభివృద్ధి



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న సీజీఎం

జ్యోతినగర్: విజ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎన్టీపీసీ రామగుండం తెలంగాణ ప్రాజెక్టు సీజీఎం కేదార్‌రంజన్ పాండు అన్నారు. స్థానిక పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయ ఆవరణలో 31వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ క్లస్టర్ లెవల్(బొల్లారం) సైన్స్ ప్రదర్శనను సోమవారం ప్రారంభించారు. ఇండియా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అద్భుత విజయాలు సాధించిందని, ఇటీవల చంద్రయాన్-3 ఉదాహరణగా పేర్కొన్నారు. చిన్నారులు అన్ని అంశాల్లోనూ ఎంతో శక్తి, సామర్థ్యాలను, చురుకుదనాన్ని ప్రదర్శించాలని సూచించారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు ఎగ్జిబిట్‌లను తిలకించారు. ఏజీఎం(హెచ్‌ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్, ప్రిన్సిపల్ జే.ప్రసాద్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సూర్యకుమారి, బొల్లారం క్లస్టర్ పరిధిలోని తిరుమలగిరి, మంచిర్యాల, కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, ఎన్టీపీసీ రామగుండం, బొల్లారం, పికెట్, హకీంపేటలోని కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 'క్రెచ్'







చిన్నారులకు ఆటపాటలతో అక్షరాలు నేర్పించేందుకు కలెక్టరేట్‌లో 'క్రెచ్' ఏర్పాటైంది. కలెక్టరేట్‌లో పనిచేసే మహిళా ఉద్యోగుల ఆరేళ్లలోపు చిన్నారుల కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. చిన్నారులకు అవసరమైన ఆటవస్తువులను అందుబాటులో ఉంచారు. ఉద్యోగినులు విధులు ముగించుకుని వచ్చేవరకూ పిల్లల బాగోగులను అంగన్‌వాడీ టీచర్, ఆయా చూసుకోనున్నారు. ఈ కేంద్రాన్ని జిల్లా సంక్షేమశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. – పెద్దపల్లిరూరల్



కన్నులపండువగా లక్షబిల్వార్చన

ఓదెల: శ్రావణమాసం సందర్భంగా ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. సుమారు 300మంది దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు దూపం వీరభద్రయ్య ఆధ్వర్యంలో భ్రమరాంభ మల్లికార్జునస్వామికి పత్రిపూజ చేశారు. ఆలయ ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, భక్తులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ట్రినిటీ కళాశాల విద్యార్థినికి ప్రశంసాపత్రం



శాంతికి ప్రశంసాపత్రం ఇస్తున్న గవర్నర్ తమిళిసై

పెద్దపల్లిరూరల్: జాతీయ విద్యావిధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా 'సామాజిక ఆర్థిక అసమానతలను రూపుమాపడంలో విద్య పాత్ర' అనే అంశంపై రాజ్‌భవన్‌లో వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఇందులో పెద్దపల్లి ట్రినిటీ డిగ్రీ కాలేజీ విద్యార్థిని నిమ్మలపూడి శాంతి ప్రతిభ చాటింది. ఆంగ్ల భాషలో వ్యాసం రాసి, మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు గవర్నర్ తమిళిసై ఆదివారం ప్రశంసాపత్రాలతోపాటు నగదు పురస్కారాలు అందించారు. శాంతిని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మల్లేశం, రిజిస్ట్రార్ వరప్రసాద్ అభినందించారు. పెద్దపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ సీతారెడ్డి, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

రేపు 'వృత్తివిద్య' మహిళలకు పరీక్ష

గోదావరిఖని: సింగరేణి సంస్థ ద్వారా వృత్తి విద్యలో శిక్షణ పొందిన మహిళలకు ఈ నెల 13న ఉదయం 10 గంటలకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ.సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో యైటింక్లయిన్‌కాలనీ, పోతనకాలనీ, పెంచికల్‌పేట్ మహిళలకు వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన మహిళలు పరీక్షకు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఉత్తీర్ణులైనవారికి సర్టిఫికెట్లు అందిస్తామన్నారు.

నేడు 'స్వయం ఉపాధి' మహిళలకు పరీక్ష

గోదావరిఖని: స్వయం ఉపాధిలో శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం ఉదయం 10 గంటలకు గోదావరిఖని ఆర్సీవోఏ క్లబ్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్జీ–1 అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర వృత్తి శిక్షణ తరగతులకు హాజరైనవారు ఈ పరీక్ష తప్పకుండా రాయాలన్నారు. ఉత్తీర్ణులైన వారికి భారత్ గ్రామోద్యోగ మహా విద్యాలయ వారిచే సర్టిఫికెట్ అందించనున్నట్లు పేర్కొన్నారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



గోదావరిఖని: వార్షిక నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, టార్గెట్ కమిటీ బృందం డీవీఎస్ సూర్యనారాయణరాజు, జె.రమేశ్ అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆయా గనులు, ఓసీపీలకు కావాల్సిన యంత్రాలు, యంత్ర సామగ్రి, పనిముట్లపై సూచనలు చేశారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరంలో తీయాల్సిన బొగ్గు ఉత్పత్తిపై అధికారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. గనుల వారీగా ఉత్పత్తి సామర్థ్యం, మ్యాన్‌పవర్, తీయాల్సిన లక్ష్యాలు, అవసరమయ్యే రక్షణ చర్యలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ఏరియా ఇంజినీర్ రామ్మూర్తి, ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, ఏజెంట్ సైదులు, ప్రాజెక్టు అధికారి కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూములు పాయె పరిహారం రాకపాయె

- అవార్డు క్యాన్సిల్ అయినా పట్టాలివ్వని ప్రభుత్వం
- రెవెన్యూ రికార్డుల్లో సింగరేణి పేరిట నమోదు
- పథకాలు అందక బుధవారంపేట, రాజాపూర్ రైతుల ఇబ్బంది
- మళ్లీ 88 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్?



బుధవారంపేట గ్రామం

రామగిరి: మండలంలోని బుధవారంపేట, రాజాపూర్ అన్నదాతలు అయోమాయనికి గురవుతున్నారు. ఆర్జీ–3 డివిజన్ ఓసీపీ–2 విస్తరణ కోసం సింగరేణి సంస్థ ఈ రెండు గ్రామాలకు చెందిన 218 మంది రైతు కుటుంబాలకు సంబంధించిన 708.16 ఎకరాల భూసేకరణ చేపట్టింది. 2009లో డ్రాఫ్ట్ డిక్లరేషన్ ఇచ్చి, 2011లో నోటిఫికేషన్ ప్రకటించి, 2015లో అవార్డు సైతం జారీ చేసింది. లోక్ అదాలత్ ద్వారా వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఎకరాకు రూ.9.60 లక్షలు చెల్లించడం గత నిబంధనలకు విరుద్ధమని, పాత చట్టం ప్రకారం రూ.4.60 లక్షలు చెల్లిస్తామని సింగరేణి యాజమాన్యం రూ.37 కోట్లు స్థానిక బ్యాంక్‌లో డిపాజిట్ చేసింది. తమకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, వ్యవసాయ భూములతోపాటు గ్రామాన్ని తీసుకొని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇందుకు సింగరేణి ఒప్పుకోకపోవడంతో అవార్డు క్యాన్సిల్ చేయాలని వారు హైకోర్టులో కేసు వేయగా 2022 నవంబర్ 15న న్యాయస్థానం అవార్డు క్యాన్సిల్ చేస్తూ తీర్పు వెల్లడించింది.

సుమారు 50 మంది మృతి

వ్యవసాయ భూములను తీసుకునే సమయంలో గ్రామాన్ని కూడా తీసుకుంటామని సింగరేణి యాజమాన్యం తెలిపిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 2017లో ప్రభుత్వం నిర్వహించిన భూ సర్వేలో రైతుల పేరిట ఉన్న భూములను రెవెన్యూ రికార్డుల్లోకి సింగరేణి పేరిట మార్చారు. దీంతో అన్నదాతలకు రావాల్సిన రైతు బంధు, సుమారు 50 మంది రైతులు మరణిస్తే వారి కుటుంబాలకు చెందాల్సిన రైతు బీమా కోల్పోయారు. అవార్డు క్యాన్సిల్ అయినా ప్రభుత్వం పట్టాలు అందివకపోవడంతో భూములను అమ్మేందుకు, కొనేందుకు ఇబ్బంది పడుతున్నామని, పెట్టుబడి సాయం కోసం ఏ బ్యాంక్‌కు వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ భూములపై హక్కులు కోల్పోయి, అప్పుల ఊబిలో కూరుకుపోయామని, ప్రభుత్వం స్పందించి, పట్టాలు ఇచ్చి, అన్ని పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అన్యాయం చేయొద్దంటున్న రైతులు

హైకోర్టు తీర్పు ప్రకటించి, అవార్డు క్యాన్సిల్ అయిందని తెలిపినప్పటికీ భూసేకరణపై స్పష్టత రాకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. మళ్లీ సింగరేణి యాజమాన్యం ఓసీపీ–2 విస్తరణ కోసం 88 ఎకరాల వ్యవసాయ భూమి సేకరించనుందని తెలియడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎనిమిదేళ్లుగా అన్నివిధాలా నష్టపోయామని, ఇంకోసారి భూసేకరణ అంటూ తమకు అన్యాయం చేయవద్దని రైతులు వేడుకుంటున్నారు.

రైతుబీమా వర్తింపజేయాలి



మా గ్రామంలో నా భర్త రాజయ్య పేరిట రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆయన అనారోగ్యంతో 2022 ఆగస్టు 6న చనిపోయాడు. భూమికి పట్టా లేకపోవడంతో రైతు బీమా కోల్పోయాను. అవార్డు క్యాన్సిల్ అయినందున పట్టా ఇచ్చి, రైతు బీమా వర్తింపజేయాలి.

– మడిపెల్లి సుగుణ, బుధవారంపేట

పథకాలు అందడం లేదు



మా మూడెకరాల భూమిని సింగరేణి తీసుకొని, ఎలాంటి పరిహారం చెల్లించడం లేదు. పట్టాలు ఇవ్వకపోవడంతో మాకు ప్రభుత్వం పథకాలు రైతు బంధు, రైతు బీమా అందడం లేదు. మా భూములన్నీ సింగరేణి పేరిట ఉండటంతో బ్యాంక్‌లు లోన్ ఇవ్వడం లేదు.

– బాపు కత్తెరసాల, బుధవారంపేట

అన్ని రకాలుగా నష్టపోయాం



మాకు పరిహారం చెల్లించకుండా మా భూములపై అవార్డు పాస్ చేయడం వల్ల అన్ని రకాలుగా నష్టపోయాం. సింగరేణి ఇచ్చిన అవార్డును క్యాన్సిల్ చేస్తూ హైకోర్టు తీర్పు ప్రకటించినా పట్టాలు ఇవ్వడం లేదు. ఇన్నేళ్లు కోల్పోయిన రైతు బంధును ఇచ్చి, పట్టాలు అందజేయాలి.

– అద్దూరి రాజయ్య, బుధవారంపేట

దరఖాస్తు చేసుకుంటే ఇస్తామన్నారు



తుర్కపల్లి శివారులో 88 ఎకరాల భూ సేకరణ చేపట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. రైతులు ధరణిలో దరఖాస్తు చేసుకుంటే విచారించి, పట్టాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. సింగరేణి అభివృద్ధికి రైతులు సహకరించాలి.

– సుధాకర్‌రావు, ఆర్జీ–3 జీఎం

కేసీఆర్ భయంతోనే ఇండియా పేరు మార్పు

- కోర్టుకు హాజరుకాని బండి రాజీనామా చేయాలి
- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్



మాట్లాడుతున్న రవీందర్ సింగ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: భారత రాష్ట్ర సమితి ఆవిర్భావంతోనే ప్రధాని మోదీ ఇండియా పేరు భారత్‌గా మార్చేందుకు సిద్ధపడ్డారని సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఫైర్‌అయ్యారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంతకాలం డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా అన్న మోదీ భారత రాష్ట్ర సమితితో భయపడ్డారన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పెద్ద బ్లాక్ మెయిలర్ అని మండిపడ్డారు. దురుద్దేశ పూర్వకంగా కేసులు వేసి, విచారణకు డుమ్మాలు కొడుతున్నారని ఆరోపించారు. ఎంపీ ప్రత్యర్థులను బ్లాక్ మెయిల్ చేసేందుకే కోర్టులో కేసులు వేస్తారన్నారు. అమెరికా వెళ్లి ఫుట్‌బాల్ ఆడే తీరిక ఉన్న సంజయ్‌కు కోర్టులో తాను వేసిన కేసుకు తానే హాజరుకానంత బిజీ ఏముందని ప్రశ్నించారు. న్యాయస్థానాల మీద ఏమాత్రం గౌరవంలేని, స్థానిక సమస్యలను పట్టించుకోని సంజయ్ వెంటనే తన పదవికిరాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం వసూళ్ల కోసమే ఆయన అమెరికా పర్యటనకు వెళ్లారని, అక్కడ ఎంత వసూలు చేశారో ప్రజలకు వెల్లడించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సంజయ్‌కు ఓటర్లు తగిన చెబుతారని హెచ్చరించారు.

వెంకట్రామ్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ మధు దంపతులు

మంథని: పేద విద్యార్థులకు ఉచిత వసతి గృహాలు ఏర్పాటు చేసి, సహకారం అందించిన రాజా బహదూర్ వెంకట్రామ్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథనిలో నిర్మించిన రెడ్డి సంఘం భవనాన్ని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి ప్రారంభించారు. అనంతరం భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన వెంకట్రామ్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. నిజాం పాలనలో కానిస్టేబుల్ నుంచి ఐజీ స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కులమతాలకు అతీతంగా పేదలందరికీ హైదరాబాద్‌లో వసతిగృహాలను ప్రారంభించారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక నియోజకవర్గ విద్యార్థుల ఉన్నత విద్యకు కష్టాలు లేకుండా హైదరాబాద్‌లో వసతిగృహాలు ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ ట్రాక్టర్ తయారు చేసిన నాగారం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి శశిరథ్ సన్మానించారు.

నిరుద్యోగుల్లో చిగురించిన ఆశలు

- ఏఎన్ఎం, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సర్కారు కసరత్తు



సుల్తానాబాద్: ఏఎన్ఎం, ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎంతగానో ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఆయా పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్టీ) త్వరలో నిర్వహిస్తామని ప్రకటించింది. పెద్దపల్లి జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటితోపాటు ఏఎన్ఎం (కాళేశ్వరం జోన్‌లో 169) పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు నిరుద్యోగులు ఉత్సాహం చూపుతున్నారు. ట్రైబల్ ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏడాదికి 2.5, నాన్ ట్రైబల్ ఏరియాలో పనిచేస్తున్న వారికి 2 మార్కులను కేటాయించనున్నారు.

జిల్లాలో 694 పాఠశాలలు..

జిల్లాలో 510 ప్రాథమిక, 83 ప్రాథమికోన్నత, 101 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 39 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. మొత్తంగా జిల్లాకు 2,463 పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 2,205 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. 258 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీఆర్‌టీ ప్రక్రియ పూర్తయితే ఖాళీల భర్తీతోపాటు బోధన మెరుగుపడే అవకాశం ఉంది.

15న టెట్..

ఏటా బీఎడ్, డీఎడ్ అభ్యర్థుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వం టీఆర్‌టీని 2017లో, టెట్‌ను గతేదాది జూన్ 12న నిర్వహించింది. తాజాగా ఈ నెల 15న టెట్ నిర్వహించనున్నారు. ఆగస్టు 2 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. సెప్టెంబర్ 27 ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ నేపథ్యంలో టీఆర్టీకి పోటీ తీవ్రంగా ఉండనుంది.

22న తేలనున్న 'గుర్తింపు'

- డిప్యూటీ సీఎల్‌సీతో సుదీర్ఘంగా భేటీ
- హాజరైన రిజిస్టర్డ్ కార్మిక సంఘాలు
- సింగరేణి యాజమాన్యం



ఆర్ఎల్‌సీ వద్ద సమావేశమైన కార్మిక సంఘాల నాయకులు

గోదావరిఖని: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతాయా..? లేదా..? అనేది ఈనెల 22న తేలనుంది. సోమవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎల్‌సీ వద్ద రిజిస్టర్డ్ కార్మిక సంఘాలు, సింగరేణి యాజమాన్యంతో త్రైపాక్షిక సమావేశం జరిగింది. సుదీర్ఘంగా భేటీ అయి ఈనెల 22న గుర్తింపు ఎన్నికలపై నోటిఫికేషన్ ఇచ్చేందుకు నిర్ణయించారు. ముందుగా సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాల నేతలు వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి వచ్చేనెల 27న ఎన్నికలు నిర్వహించాలని మినిట్స్ రాసుకున్నారు. డైరెక్టర్(పా) బలరాం సమావేశానికి రెండు గంటలు ఆలస్యంగా వచ్చాక మినట్స్‌లో మార్పులు చోటు చేసుకున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈనెల 21న 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ బకాయిలు చెల్లించనున్న క్రమంలో 22న ఎన్నికలపై ప్రకటన చేయాలని డైరెక్టర్(పా) సూచించారు. దీంతో ఈనెల 22న ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని సంఘాలు, యాజమాన్యం, డిప్యూటీ సీఎల్‌సీ వద్ద ఒప్పందంపై సంతకాలు చేశామని నాయకులు తెలిపారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేనా?

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల బిజీలో ఉన్న పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సింగరేణి ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం వచ్చేనెలలో తప్పనిసరిగా సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌పై సుదీర్ఘ కసరత్తు చేశారు. అయితే డైరెక్టర్(పా) వచ్చిన తర్వాత మొత్తం షెడ్యూల్ మారినట్లు చెబుతున్నారు. ఎన్నికల ఆలస్యంపై హైకోర్టులో కెవియట్ పిటిషన్ వేయనున్నట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య వెల్లడించారు.

అర్హులకు ఓటు కల్పించాలి



వీసీలో కలెక్టర్, అధికారులు

పెద్దపల్లిరూరల్: అర్హులకు ఓటు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, జాయింట్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. దివ్యాంగుల ఓటరు వివరాలు మ్యాపింగ్ చేయాలన్నారు. ఆర్డీఓలు మధు మోహన్, హనుమానాయక్, స్వీప్ నోడల్ అధికారి రవుఫ్‌ఖాన్, ఏఓ శ్రీనివాస్ తదితరులున్నారు. ఓటుహక్కు ఉన్న ప్రతిఒక్కరూ ఓటు వినియోగించుకునేలా కళాకారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. ఓటు ప్రాముఖ్యతపై నాటకరూపంలో ప్రదర్శించి సులువుగా అర్థమయ్యేలా చూడాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

గోదావరిఖనిటౌన్: ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని దండోరా కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు నాటి నుంచి నేటి వరకు ఎస్సీ వర్గీకరణ విషయమై మభ్యపెడుతూ దళితుల ఓట్లను దండుకుంటున్నాయని ఆరోపించారు. ఈసారి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకుంటే ఢిల్లీ గద్దె దద్దరిల్లేలా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు తోకల ప్రశాంత్, నక్క సురేశ్, బచ్చల కొమురయ్య, జిల్లెల్ల విజయ్, కనకం శంకర్, కుమ్మరి లక్ష్మీనారాయణ, ఇందారం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మమ్మను హతమార్చిన మనవడు

- అరగుంట భూమి కోసం ఘాతుకం
- చందపల్లిలో ఘటన

పెద్దపల్లిరూరల్: అరగుంట భూమి కోసం తన అమ్మమ్మను కడతేర్చాడు ఓ యువకుడు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి పట్టణ శివారు చందపల్లికి చెందిన నాంపల్లి రాజమ్మ(95)కు ఎనిమిది మంది సంతానం (ఆరుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు). ఇదే గ్రామంలో ఆమె కూతురు మొలుగూరి మల్లీశ్వరి ఉంటోంది. మరో కూతురు చంద్రకళ పెళ్లయిన కొంతకాలానికి భర్తతో విభేదాల కారణంగా తల్లి వద్దే ఉంటోంది. ఆమెకు ఇల్లు లేదని రాజమ్మ తనకున్న అరగుంట భూమిని ఇచ్చింది. అప్పట్నుంచి మల్లీశ్వరి కొడుకు మహేశ్ తన అమ్మమ్మపై కక్ష పెంచుకున్నాడు. గతంలోనూ రెండుసార్లు ఆమెపై దాడి చేశాడు. ఈ క్రమంలో నడవలేని స్థితిలో ఉన్న రాజమ్మ తలపై ఆదివారం రాత్రి ఇనుప రాడ్డుతో కొట్టి, అతికిరాతకంగా హతమార్చాడు. సంఘటన స్థలాన్ని సోమవారం సీఐ అనిల్‌కుమార్, ఎస్సై మహేందర్ పరిశీలించారు. మృతురాలి కుమారుడు రాజవీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పాలన అవినీతిమయం

- డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్
- కాంగ్రెస్‌లో చేరికలు



కండువాలు కప్పుతున్న రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్: బీఆర్ఎస్ పాలన అవినీతిమయంగా మారిందని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆరోపించారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం మూడో డివిజన్ న్యూపోరట్‌పల్లికి చెందిన బీజేపీ దళిత మోర్చా కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు మేరుగు లింగమూర్తి, బీజేవైఎం మాజీ ఉపాధ్యక్షుడు ముస్కె బినేశ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్ష మేరకు ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇస్తే తొమ్మిదేళ్లుగా రామగుండంలో పాలన పూర్తిగా అవినీతిమయం అయ్యిందన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. మేరుగు మహేశ్, శ్రీనివాస్, పోశం, జిమ్మిడి శ్రీనివాస్, వినోద్, అనురాగ్, సాయికుమార్, రాహుల్, అభిషేక్, అనుముల శ్రీకాంత్, కల్వల వంశీ, రమణ పార్టీ చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా, 3వ డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేశ్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు ముచ్చకుర్తి రమేశ్, కంది ఆంజనేయులు, సురేష్, అనిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

- పరిస్థితి విషమం?
- బాధితుడు కేశోరాం ఫ్యాక్టరీ కాంట్రాక్టు కార్మికుడు



గాయపడిన శ్రీనివాస్

పాలకుర్తి: బొలెరో టాంపర్ వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో కొడిపల్లి శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలంలోని పుట్నూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్నాడు. సోమవారం విధులు ముగించుకొని, తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో జీడీనగర్‌కు వెళ్లే రహదారి వద్ద ఫోర్‌లేన్ రోడ్డు దాటుతుండగా గోదావరిఖని వైపు వెళ్తున్న బొలేరో వాహనం వేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తల, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హెచ్‌కేఆర్ అంబులెన్స్‌లో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండటంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిసింది. బసంత్‌నగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని, వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని ఠాణాకు తరలించారు.

విషాహారం తిని రెండు నెమళ్లు మృతి



పంచనామా చేస్తున్న ఫారెస్ట్ అధికారులు

పాలకుర్తి: పెద్దపల్లి మండలంలోని కురుమపల్లి సమీప పంటపొలాల్లో విషాహారం తిని, రెండు నెమళ్లు మృతిచెందాయి. రాగినేడు గ్రామానికి చెందిన రైతు ఎరుకలి లింగయ్య కురుమపల్లి సమీపంలోని తన పొలానికి సోమవారం ఉదయం నీరు పెట్టేందుకు వెళ్లాడు. పొలంలోని ఓ మడిలో రెండు నెమళ్లు చనిపోగా మరొకటి ప్రాణాలతో కొట్టుకుంటూ కనిపించాయి. లింగయ్య గ్రామస్తులకు సమాచారం అందించాడు. స్పందించిన సోమ కుమార్, గుమ్మడి విజయ్ సంఘటనా స్థలానికి చేరుకొని, కొన ఊపిరితో ఉన్న నెమలిని చికిత్స నిమిత్తం రాగినేడు ప్రభుత్వ పశు వైద్యశాలకు తీసుకెళ్లారు. అనంతరం స్థానికుల సమాచారంతో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఈసాలతక్కళ్లపల్లి దేవదాస్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వాయుకుమార్, వాచర్‌లు ఘటనాస్థలికి చేరుకున్నారు. కురుమపల్లి పంచాయతీ కార్యదర్శి దివ్య సమక్షంలో చనిపోయిన నెమళ్లకు పంచనామా నిర్వహించి, అంత్యక్రియలు చేశారు. కాగా, స్థానికంగా నెమళ్లు సంచరిస్తున్నాయన్న విషయం తెలిసిన వేటగాళ్లు వాటిని చంపి, తినేందుకే విషాహారం పెట్టి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు.

'డబుల్' ఇళ్లు ఇచ్చేదాకా పోరాటం

- అధికార పార్టీ నేతలను ఊళ్లో రానివ్వొద్దు
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్ : అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చేవరకూ అధికార పార్టీ నేతలను ఊరిలోకి రానివ్వొద్దని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. అర్హులకు ఇళ్లు పంపిణీ చేయడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇళ్ల కేటాయింపుపై స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మౌనం వీడాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలు ఇల్లు నిర్మించుకుంటే రూ.5లక్షలు మంజూరు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజమల్లు, సుల్తానాబాద్ జెడ్పీటీసీ మినుపాల స్వరూప, మాజీ సర్పంచులు అంతటి పుష్పలత, అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ రాష్ట్ర ట్రైనింగ్ కమిటీ సభ్యులు వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్య గౌడ్, మండల అధ్యక్షుడు సతీశ్ బాబు, దామోదర్ రావు, మాజీ జెడ్పీటీసీ సారయ్య గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.